Sai Rama

# ప్రాస

ఇంకా బైట తిరగడం ప్రమాద మనిపించింది. ప్రమాదమయినా కాకపోయినా బొత్తిగా అనవసరమేనని అనుకోవచ్చు. ఈసరికి ఆ దౌర్భాగ్యుడు తన దుఃఖాన్నుండి కొంతవరకైనా దూరం జరిగిఉంటాడు. సంఘటన జరిగి నప్పటి బరువైన విచారం, కాలం తేలికచేసి వుండొచ్చు. అదృష్టవంతుణ్ణి. అతను సిగరెట్లకోసం ఆ కొట్టుదగ్గిర పర్సు తీసి... మళ్ళీ జేబులో పెట్టుకోబొయ్యే అదనులో—ఫినిష్. ఆరువందల ముప్ఫైనాలుగు రూపాయల, పదకొండణాల కాని—రైల్వేవారిని మోసంచేసి దాచిన కాలందాటిన టిక్కెట్టు—చిన్ని ఫొటో, ఏవో అంకెలుగిలికిన కాగితం—దగ్గుమందు పొట్లం. చుట్టూ జనం పోగయినారు. అందరూ జాలిని సరఫరాచేశారు. సానుభూతి దిగుమతిచేశారు. దీనికి కేంద్రప్రభుత్వం యింకా పన్ను విధించలేదు.

ఎవరు దొంగ? అందరూ—అందరమూ దొంగను వెదికాము. దూషించాము. ముద్దుపళని సిగ్గుపడే భాషను వాడాము.

చివరికి... కొంతకాలానికి—దొంగ దొరికాడు. చిరిగిన లాగు, శేగిన జుత్తు. మురికివొళ్లు—ప్రతిక్షణమూ అందరినీ తినే కళ్ళు. వాడే దొంగ! ఇదివరకు—ఒకటి రెండు సార్లు—కలవారి జేబులు కత్తిరించినమనిషి. వాడిమీద దెబ్బలు... ...దరిద్రుడు గావును, దొంగ అయినాడు. నా

దొంగతనం ఫలితం అతను అనుభవించాడు. చుట్టూ ముసిరిన నా సోదరులు అతన్ని జుట్టుబట్టుకొని వొంచడంవరకే నే నున్నాను. ఆ మరునిమిషం పార్కు కొచ్చేశాను. అక్కడ ఉండలేకపోయాను. వాళ్ళు నన్ను కనిపెడతారనికాదు— సాంఘికంగా నాకున్న విలువ, నా దుస్తులు, నాగరికత, సంభాషణానైపుణ్యం నన్ను సైన్యంలాగా కాపాడాయి. మంత్రించిన గిరులులాగా అడ్డుకొన్నాయి.

ఇప్పటికీ నా గుండెలు దడ దడ లాడుతున్నాయి. జిమ్మున కుంచుకుపోతున్నాయి. తిరుగుడులో నొక్కుకుపోతు న్నట్లుగానే ఉన్నాయి. ఎవరో మెదడులో మేకులు దించి నట్లు బాధపడుతున్నాను. తరువాత ఆ దొంగకోసం వెతి కాను. మరేమీలేదు. అతనితో నిజంచెబుదామని కానే కాదు. అతనికి కొంతకారుణ్యం పంచిపెడదామనిమాత్రమే. భాషా భాండారంనుండి రెండుమూడు సుతిమెత్తనిపదాలు అతని చెవుల్లో వొడ్డిద్దామనిమాత్రమే! దొరకలేదు. బహుశా అతని ఖర్చును ప్రభుత్వమే భరిస్తున్నదేమో ఈ పాటికి!

సోదరా! భారతదేశం 'భూతదయ'కు ప్రసిద్ధివహిం చింది. మహత్తరమైన మన సాంప్రదాయాన్ని నిలబెట్టావు. భారత యశోలలామకు ఖండ ఖండాంతరంబులగల కీర్తి సౌధంబునకు నీ వొక వెలలేని మండపంబయితివి. నీ కీర్తి ఆచంద్రతారార్కం మీ వసుధాతలంబున నిలుచుగాక. సర్వ రక్షకుడైన భగవానుడు నీకు ఆయురారోగ్యైశ్వర్యాదుల ననుగ్రహించుగాక. మఱుజన్మంబున నింతకంటె నుత్కృష్ట గర్భంబున జన్మింతువుగాక. నీ కివే నా శతసహస్ర వంద

నములు. పరా: ఈ ఐశ్వర్యాలుగూడా, వొచ్చే జన్మలోనే పొందేటట్లు తరవాత సవరించటం జరిగింది.

ఇంటి మెట్లెక్కుతున్నాను. హఠాత్తుగా నాముందు మనిషి ప్రత్యక్షమయ్యాడు. భయంతో రెం డడుగులు వెన క్కువేశాను. అతనూ న న్ననుసరించాడు. ఎవ రీతడు? ఎవ రీతడు? ? కళ్ళు మూసుకొన్నాను. గుండె బిగబట్టాను. ఒక్క ఊపుతో ఇంట్లోకొచ్చిపడ్డాను. నా హడావుడి చూచి నా భార్య అదిరిపడ్డది. నాకోస మెవరన్నా వొచ్చారేమోనని వాకబుచేశాను ఎవరూ రాలేదుట. "ఎవరన్నావొస్తారన్నారా ఏమిటి?" అని అడిగింది పైగా. ఫర్వాలేదు. నా రహస్యం తెలిసిం దేమోననీ, పోలీసులు నాకొరకు వేట ప్రారంభించా రేమోననీ, ఆ వ్యక్తి తత్ సంబంధీకుడేమోననీ భయ పడ్డాను. కాదు. బ్రతికాను.

ఆ తరవాత రెండురోజులకు అతను మళ్ళీ నాకు కని పించాడు. నేను సినిమా కెడుతున్నాను. నాకంటే ముందే అతనూ నడుస్తున్నాడు. ఛరాలున వెనుదిరిగి—బిరబిర నడక...రోడ్డు, జనం, బళ్ళు, రిక్షా, కేక. మరొక పావునిమి షంలో—ఆ రిక్షాలో కూచోగలను. గుడ్డ ముందుకులాగి ముఖానికి అడ్డుచేసుకొంటే—అతను కనుక్కోలేడు. ఎవరో మహమ్మదీయ స్త్రీ అనుకొంటాడు. పావుగంటలో యింటి కెళ్ళగలను. నా కీ సినిమా చూడాలనే పిచ్చి ఎందుకు కలి గింది? ఎందుకొచ్చాను?

నా ప్రయత్నమేమీ సాగలేదు. నేను రిక్షాలోకి వొంగు తున్నాను. అతను రిక్షాలో కనిపించాడు. నాగుండె... ఊహిం

చుకో. నేను ఎవరినుండి తప్పుకోవా లనుకుంటున్నానో, అతనే నాకెదురుపడ్డాడు. ఆ పులిచేతిలోనే నేను చిక్కుపడ్డాను. ధైర్యంగా వెనక్కి తిరిగాను. ఇంకా నయం, తిరగ్గలిగాను. ఎదురుగా బ్లూలైటు అతి నీలలోహితకాంతిని చిమ్ముతున్నది. అటువెళ్ళడం క్షేమమనిపించలేదు. ఆ వెలుగులో నన్నతను ఇట్టే గుర్తించగలడు— ఇంతకాలమూ అనుమానిస్తున్నవాడు. ఇట్టే స్థిరంచేసుకొని... చీకటి గొందులగుండా యింటిలో ప్రవేశించాను.

అతను ఎవరై ఉంటాడా అనేదే నాప్రశ్న. అతను పురుషుడేనని నేను గ్యారంటీ చేయగలను. నాలాగానే చొక్కా వేసుకొన్నాడు. నాలాగానే క్రాపు. అతని కాళ్ళకీ చెప్పులు లేవు. తమాషా ఏమిటంటే, నేను ఏరోజున ఎట్లా మేకప్ ఐతే, అతనూ, అదేరోజున అట్లాగే తయారయ్యేవాడు. ఈ విషయం నే నొకసారి "జా" దగ్గిర రుజువుపరచుకొన్నాను. నేను "జా" కోసం వెళ్ళాను. "జా"నవ్వుతూ ఎదురొచ్చారు. క్రితం మధ్యాన్నం "జా" అడిగినదాన్ని తెచ్చాను. ఆవస్తువు "జా"కిస్తే వారు ఎంతసంతోషిస్తారో నే నూహించలేదు. "జా"గారి సంతసం కోసరం అపాయాలు తినేవాళ్ళల్లో నేనూ వొకణ్ణి... కానీ— నాకంటేముందే 'అతను' ప్రత్యక్షమయ్యాడు. నేనింకా "జా"ను సమీపించనేలేదు. అతను "జా" దగ్గరగా నిలబడ్డాడు. నావొళ్లు మండిపోయింది. ఆ వస్తువును నేలకు విసిరాను. అతనూ విసిరాడు. దీన్నిబట్టి చూస్తే అతను అక్షరాలా నన్ను అనుకరిస్తున్నాడని స్పష్టమైంది.

అత నెవరు? నాతో అతనికి పనేమిటి? ఈవిధంగా న న్ననుసరించి అతను పొందగల లాభ మెటువంటిది?... ఇత్యాది ప్రశ్న లనేకం నాకు స్ఫురించాయి. వీటికి సమాధానం చెప్పుకోలేకపోతున్నాను. ఏది ఏమయినప్పటికీ అతనినుండి నేనుపడవలసిన జాగ్రత్త పెద్దమొత్తంలోనే ఉన్నది. అతన్ని ఎట్లాగైనా నానుండి దూరంచెయ్యాలి.

ఆ తెల్లవారే నేను ప్రయాణమైనాను. అప్పటికింకా ప్రొద్దుపొడవలేదు. పుష్కలంగా డబ్బుతీసుకుని... ఒంటరిగా—కాలినడకను—చేలగట్ల వెంబడి—చుట్టూ చూశాను. ఎవరూ లేరు. ఆగి—పదసవ్వడికొరకై వీనులప్పగించి... లేదు. దిట్టపడ్డగుండెతో... తిరిగి నడక ... తూరుపు ఎరుపు. ... మంచు పొత్తిళ్ళలో ఉదయం గడ్డిపూల పరిమళం. ఉరుదరీకుహార సుప్తోత్థ శార్దూలముల్ ఝురవారి శోణితశంకద్రావ, అటుదిటుతిప్పి... నా ఉత్సాహం విరిగిపోయింది. అతను నా వెనకనే వొస్తున్నాడు. కొంచెందూరంలో ఉన్నాడు. నిలబడ్డాను. అతనూ ఆగాడు... నా ప్రయాణం అతని కెట్లా తెలుసు? ఎవరు చెప్పారు? ఎవరికీ తెలీదుగదా ఈ విషయం?

ఈవిధంగా అతను చాలాకాలంనుండి న న్ననుసరిస్తున్నాడు. ఒక్కోసారి అతను చాలా తమాషాలు చేసేవాడు. ఒకసారి బహుదీర్ఘంగా కనిపిస్తాడు. గజంకడుపు, మూడు గజాలకాళ్లు. ములుకోలల్లా చేతులు. అర్ధగజం తల. ఇంకోసారి మరుగుజ్జు. గలివర్ వర్ణించిన ఆరంగుళాల పరిమాణంలో ఉంటాడు. ఒక మధ్యాహ్నం పెద్దకత్తి తీసుకొని, అతనికోసం ఎదురుచూస్తూ కూచున్నాను. అరగంట గడిచినా అతని

జాడేలేదు. ఈమనిషికి మందు-కత్తిగదా అనుకున్నాను ఇక ఏక్షణమూ కత్తిని విడచి ఉండకూడదని నిశ్చయించు న్నాను. సాయంత్రం బజారుకొస్తుంటే అతను కనిపిం చాడు. ధైర్యంతో కత్తి చివ్వనలాగాను. అతనూ అదేపని చేశాడు. నాకు గుండె చాలిందికాదు. ఈయుద్ధంలో ఒకవేళ నేనే చనిపోతే? చావటం బొత్తిగా యిష్టంలేదునాకు. జీవించి అనుభవించవలసిన వనేకం ఉన్నాయి. ఈ ముష్టివెధవకోస రమని నేను నా అనుభవాలను వొదులుకోలేను... ఐనా అతన్ని చంపటంగూడా అనవసరమే! అతనివల్ల నాకే అపా యమూలేదు. ఉట్టినే నన్ను వెంబడిస్తున్నంతమాత్రాన నాకు పోయేదేమున్నది గనక? ఒకవేళ ఏ పురాతన దేవతలో, బంధువులో, మిత్రులో...

ఇది కొంతకాలంక్రిందటి సంగతి. అప్పటినుండీ అతను నన్ను వెంటాడుతూనేవున్నాడు. అతన్నుండి నేను తప్పించు కోవాలని ప్రయత్నం చేస్తూనే ఉన్నాను. ఇటీవలే అతనెవరో నేను తెలుసుకోగలిగాను. ఎందుకు నన్నట్లా అనుసరిస్తు న్నాడోకూడా గ్రహించాను. అతన్ని ఈనాడు పుస్తకం లాగా చదివెయ్యగలను. అతనంటే కించిత్తు భయంగూడా లేదు. అతనెవరంటారా? చెప్పను. ఎప్పటికీ చెప్పను. ఇప్ప టికే మీలోకొందరు, అతన్నిగురించి తెలుసుకొని ఉంటా రని నా నమ్మకం. లేదా ఇకముందు తెలుసుకొంటారు.